www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 6 మే 2025

5

ఏలూరు



భోజనానికి ముందు చేతులు శుభ్రపర్చుకోవాలి

పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎండి.అక్తర్

ఏలూరు సిటీ : చేతులు శుభ్రపరచుకొని భోజనం చేయడం వల్ల 80 శాతం జీర్ణకోశ సంబంధ వ్యాధులను నివారించుకోవచ్చని సోమవారం ఏలూరు శనివారపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎండి.అక్తర్ సూచించారు. ప్రపంచ హ్యాండ్ వాష్ డే సందర్భంగా అక్తర్ మాట్లాడుతూ అపరిశుభ్ర చేతులతో భోజనం చేయటం వల్ల నులిపురుగు వ్యాధితోను, వాంతులు, విరోచనాలు, కామెర్లు, టైఫాయిడ్, జిగట విరోచనాలు, అతిసార తదితర జీర్ణకోశ సంబంధ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది కాబట్టి ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు చేతులు, కాళ్లు, తినే ప్లేట్లు శుభ్రపరుచుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ హ్యాండ్ వాష్‌కు సంబంధించి 7 స్టెప్స్ సోదాహరణంగా చేసి అక్కడ ప్రజలతో కూడా ప్రాక్టీస్ చేయించారు. మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ బాలాజీ, స్టాఫ్‌నర్స్ పాల్గొన్నారు.

డిఎస్‌సిలో బ్యాక్‌లాగ్.. పోస్టులేవీ..!

ముస్లిం మైనార్టీ (బిసి-ఇ) కేటగిరి అభ్యర్థులకు తీరని నష్టం

2024 వైసిపి ప్రభుత్వం జారీ చేసిన డిఎస్‌సిలో ఉన్న బ్యాగ్‌లాగ్ పోస్టులు

తాజా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఆ పోస్టులు మాయం

బ్యాక్‌లాగ్ పోస్టులున్నా.. లేనట్టు జిల్లా విద్యాశాఖ పంపిన జాబితానే కారణం

గుడ్డి, చెవుడు కేటగిరి బ్యాక్‌లాగ్ పోస్టుల్లోనూ అదే నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి జారీ చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో బిసి-ఇ (ముస్లిం మైనార్టీ) కేటగిరికి తీరని నష్టం కన్పిస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారుల తప్పిదంతో ముస్లిం మైనార్టీ కేటగిరిలో పది ఎస్‌జిటి పోస్టులు, గుడి, చెవుడు అంగవైకల్య కేటగిరిలో దాదాపు 15 పోస్టులు కోల్పోయిన పరిస్థితి. జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలకు సంబంధించి రాష్ట్ర కేంద్రానికి ఇచ్చిన నివేదికలో జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. దీంతో తమ కేటగిరికి సంబంధించిన బ్యాక్‌లాగ్ పోస్టులను డిఎస్‌సి నోటిఫికేషన్‌లో పొందుపరచాలంటూ బిసి-ఇ సామాజిక తరగతిలో అర్హులైన అభ్యర్థులంతా కోరుతున్నారు. 2014లో టిడిపి ప్రభుత్వ హయాంలో డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేసింది. ముస్లిం మైనార్టీ (బిసి-ఇ) కేటగిరికి సంబంధించి మొత్తం 36 పోస్టులను పొందుపరిచింది. వాటిలో పురుషులకు 24, మహిళలకు 12 పోస్టులు ఉన్నాయి. డిఎస్‌సి పరీక్షలో 26 మంది మాత్రమే అర్హత సాధించారు. దీంతో ఎనిమిది మహిళ, రెండు పురుషులకు సంబంధించిన ఖాళీలు అలానే ఉండిపోయాయి. 2018లో మరోసారి డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ జిల్లా, మండల పరిషత్ స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు లేనట్లు చూపించారు. దీంతో బ్యాక్‌లాగ్ పోస్టులు చూపించలేదని అప్పట్లో చెప్పుకొచ్చారు. 2022లో తక్కువ సంఖ్యలో 550 బ్యాక్‌లాగ్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి వైసిపి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. తక్కువ సంఖ్యలో ఇచ్చిన కారణంగా 2014లో మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ పోస్టుల ఖాళీలు చూపించకుండా వదిలేశారు. 2024లో ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం 6,100 ఖాళీలతో డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో వంద ఎస్‌జిటి పోస్టులు అందులో ఉన్నాయి. ముస్లిం మైనార్టీలకు సంబంధించి బిసి-ఇ కేటగిరిలోని గతంలో మిగిలిపోయిన పది బ్యాక్‌లాగ్ పోస్టులను చూపించారు. దీంతో ఆ సామాజిక తరగతి అభ్యర్థులంతా ఆనందపడ్డారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసిపి ప్రభుత్వం జారీ చేసిన డిఎస్‌సిని రద్దు చేసింది. మెగా డిఎస్‌సి పేరుతో 2025 ఏప్రిల్ 20న నూతనంగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1,035 పోస్టులకు సంబంధించి ఖాళీలను నోటిఫికేషన్‌లో చూపించారు. ఇందులో 420 ఎస్‌జిటి పోస్టులు ఉన్నాయి. ఇందులో బిసి-ఇ కేటగిరిలో ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కింద 16 పోస్టులు మాత్రమే ఖాళీలు చూపించారు. గతంలో మిగిలిన బ్యాక్‌లాగ్ పది పోస్టులను చూపించలేదు. నిబంధనల ప్రకారం వాటిని కూడా కలిపి 26 పోస్టులు చూపించాల్సిన ఉన్నప్పటికీ అలా జరగలేదు. ఉర్దూ పోస్టులకు సంబంధించి మూడు బ్యాక్‌లాగ్ పోస్టులను చూపించి సరిపెట్టారు. దీంతో బిసి-ఇ సామాజిక తరగతికి సంబంధించిన అభ్యర్థులు ఈ డిఎస్‌సిలో పది పోస్టులను కోల్పోయిన పరిస్థితి నెలకొంది. జిల్లా విద్యాశాఖాధికారులు బ్యాక్‌లాగ్ పోస్టుల వివరాలను రాష్ట్ర కేంద్రానికి పంపకపోవడమే ఈ తప్పిదానికి కారణమని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజువల్, ఇయరింగ్ బ్యాక్‌లాగ్ పోస్టుల్లోనూ అదే నిర్లక్ష్యం

2014 డిఎస్‌సిలో విజువల్ (గుడ్డి) కేటగిరిలో 24 పోస్టులకుగాను ఆరు మాత్రమే భర్తీ చేశారు. ఇంకా 18 పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. ఇయరింగ్ (చెవుడు) కేటగిరిలో 11 పోస్టులకు నాలుగు మాత్రమే భర్తీ చేయగా ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహిళలకు సంబంధించి ఇదే కేటగిరిల్లో పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 35 బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నప్పటికీ ప్రస్తుత డిఎస్‌సిలో చూపించలేదు. 2022లో చూపించిన 15 పోస్టులకు సంబంధించి కోర్టులో కేసు పెండింగ్ ఉన్నప్పటికీ మిగిలిన 15 పోస్టులు కూడా చూపించని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు చూపించొద్దన్నారు..

ఎం.వెంకటలక్ష్మమ్మ, డిఇఒ

బ్యాక్‌లాగ్ పోస్టులపై కోర్టులో ఉండటం కారణంగా చూపించొద్దన్నారు. అందుకే ప్రస్తుత డిఎస్‌సిలో చూపించలేదు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీచేసేటప్పుడు వీటిని భర్తీ చేస్తారు. 2024 వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన డిస్‌సిలో పొందుపరిచిన పోస్టులు, 2025 డిఎస్‌సిలో ఎందుకు లేవన్న ప్రశ్నకు మాత్రం డిఇఒ నుంచి సరైన సమాధానం రాని పరిస్థితి నెలకొంది. కోర్టులో ఉన్నది గుడ్డి, చెవుడు బ్యాక్‌లాగ్ పోస్టులకు సంబంధించినవని, ముస్లిం మైనార్టీ బిసి-ఇ కేటగిరికి సంబంధించినవి కావుగా అనే ప్రశ్నకు డిఇఒ సమాధానం ఇవ్వలేదు.

అర్జీల సత్వర పరిష్కారమే ధ్యేయం

విభిన్న ప్రతిభావంతుల వద్దకే వెళ్లి అర్జీలు స్వీకరించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అర్జీదారుల సమస్యలను పరిష్కరించడమే కాకుండా వారిని గౌరవంగా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అర్జీదారుల నుంచి 226 దరఖాస్తులు స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతుల వద్దకు వెళ్లి కలెక్టర్ వెట్రిసెల్వి అర్జీలు స్వీకరించి, వారి సాధకబాధకాలను విని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి ఎం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏలూరు హనుమాన్‌నగర్‌కు చెందిన కుక్కుర రమాదేవి అర్జీనిస్తూ తన భర్త నరసింహారావు అనారోగ్యంతో మరణించినందున తన జీవనోపాధి కోసం పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. భీమడోలు మండలం ఎంఎంపురానికి చెందిన బుంగ చంద్రరావు అర్జీనిస్తూ తన పేరున చెరువుకు సంబంధించి తనకు ఉన్న భూమికన్నా తక్కువ ఆన్‌లైన్‌లో నమోదైందని, ఈ విషయాన్ని పరిశీలించి మొత్తం భూమి ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏలూరు పవర్‌పేటకు చెందిన పిల్ల హరినారాయణరావు అర్జీనిస్తూ పెదపాడు మండలం సోమవరప్పాడులో భీష్మరి కాలనీలో తమ ప్లాట్ సర్వే చేసి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం అధిక దిగుబడులొస్తే నేరమా

మంత్రి మనోహర్ వ్యాఖ్యలు తగవు - వైసిపి జిల్లా అధ్యక్షుడు డిఎన్ఆర్

గోపీనాథపట్నం, తిమ్మయ్యపాలెంలో తడిచిన ధాన్యాన్ని పరిశీలించిన వైసిపి బృందం

ప్రజాశక్తి - ఉంగుటూరు



తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నేతలు

'గతం కంటే అధిక దిగుబడులు సాధించిన రైతులు చేసిన తప్పా.. మా ప్రభుత్వంలో అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కొన్నాం.. ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం.. బీమా కల్పించాం. మీరేమో రైతులకు టార్గెట్లు విధిస్తారా' అంటూ వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నించారు. ఉంగుటూరు మాజీ ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబుతో కలిసి ఆయన సోమవారం మండలంలోని తిమ్మయ్యపాలెం, గోపీనాథపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా తిమ్మయ్యపాలెం రైతులు పలువురు సంచులు ఇచ్చి పది రోజులైనా లారీలు రాకపోవడం వల్ల బస్తాలు వర్షానికి తడిచిపోయాయన్నారు. ధాన్యం రంగు మారి మొలకలు వస్తున్నాయని వాపోయారు. ఆరబెట్టిన ధాన్యాన్ని వాసుబాబు, నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ రైతులకు ధైర్యం చెప్పాల్సిపోగా ప్రభుత్వం ధాన్యం వ్యాపారం చేయడం లేదు, టార్గెట్ మేరకే కొనుగోలు చేస్తాం, మిగిలిన బయట అమ్ముకోండి అని మంత్రి అనడం బట్టి ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో తేటతెల్లమైందని విమర్శించారు. కష్టపడి ఎక్కువ దిగుబడులు సాధించిన రైతులను అభినందించాల్సిందిపోయి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. వాసుబాబు మాట్లాడుతూ మోడీ భజనలో ప్రభుత్వం వాతావరణ శాఖ హెచ్చరికలను పట్టించుకోకుండా సంచులు ఇవ్వకపోవడం వల్లే అకాల వర్షాలకు రైతులు దొరికిపోయారని, ఇప్పటికైనా ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష వాహనం ప్రారంభం

ఏలూరు: బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష వాహనాన్ని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరం ఆవరణలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్ కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.మాలినితో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్రీయ బాల సురక్షా రక్ష కార్యక్రమంలో భాగంగా బాలల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ వాహనాన్ని ఏర్పాటు చేసిందన్నారు. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఒక మంచి కార్యక్రమం అని తెలిపారు. దీనిద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, బాలల ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడానికి కూడా ఇది సహాయపడుతుందన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రల ద్వారా గుర్తించిన లోపాలున్న పిల్లలను వారికి దగ్గరలోని ఏలూరు, జంగారెడ్డిగూడెంల్లోని జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రానికి చికిత్స కోసం తీసుకొచ్చి మళ్లీ తిరిగి దింపేలా జంగారెడ్డిగూడెం, ఏలూరు ఆస్పత్రుల్లో ఈ వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శారద, ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారి కె.నరేంద్రకృష్ణ, జిల్లా మేనేజర్ బొప్పన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కడి అధికారులకు ఏమైంది..!

కోర్టు ఆదేశాలు ధిక్కరించి ఇళ్ల కూల్చివేత

పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో కోర్టు స్టే ఇచ్చిన ఇళ్లనూ కూల్చేసిన అధికారులు

ఒక ప్రాంతంలో స్టే విధిస్తే అదే ప్రాంతంలో అదే సమస్యకు స్టే వర్తించినా పట్టని అధికారులు

రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారుల తీరుపై సర్వత్రా చర్చ

శిథిలాల మధ్య జీవనం సాగిస్తున్న ఎఎస్ఆర్ నగర్ వాసులు



పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో బరకాలతో పందిరిగా వేసుకున్న జీవనం సాగిస్తున్న ఇళ్ల తొలగింపు బాధితులు

ప్రజాశక్తి - భీమవరం


ప్రజాస్వామ్య వ్యవస్థలో సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను ప్రతిఒక్కరూ గౌరవిస్తారు.. తుచ తప్పకుండా పాటిస్తారు. దీనిలో ప్రభుత్వ అధికారుల పాత్ర చాలా కీలకం. అయితే సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను సైతం ధిక్కరించింది వాటిని పాటించాల్సిన అధికారులే అయితే. ఇదే పరిస్థితి పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లోని ఇళ్ల కూల్చివేతలో స్పష్టంగా కన్పిస్తోంది. కోర్టు స్టే విధించినా కనీసం పట్టించుకోకుండా బుల్డోజర్లతో ఇళ్లను ధ్వంసం చేయడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. దీనికి మండలాధికారులు బాధ్యత వహిస్తారా, లేక జిల్లా అధికారులే మూల్యం చెల్లించుకుంటారా అనే చర్చ కూడా పెద్దఎత్తున సాగుతోంది.

1986 నుంచి ఎఎస్ఆర్ నగర్ ప్రాంతంలో జనం నివాసముంటున్నారు. 108 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నాయి. అయితే ఈ ఇళ్లకు చేర్చి ఉన్న రాజు కాలువ కలుషితమవుతుందనే పేరుతో వీటిని తొలగించే చర్యలను అధికారులు మూడు నెలల క్రితం చేపట్టారు. దీంతో 53 కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. ఆ ఇళ్లకు కోర్టు స్టే విధించింది. సుమారు 46 ఇళ్లను అధికార యంత్రాంగం కూల్చేసింది. వీటితోపాటు కోర్టు స్టే ఇచ్చిన మరో మూడు ఇళ్లను సైతం రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు దగ్గరుండి మరీ కూల్చివేయించారు. తమ ఇళ్లను తొలగించొద్దని, దానికి కోర్టు స్టే ఇచ్చిందని సంబంధిత కుటుంబీకులు చెప్పినా అధికారులు పట్టించుకోలేదు. కనీసం కోర్టు ఆదేశాలను పరిశీలించకుండా ఇళ్లను కూల్చివేయడం వెనుక ఆంతర్యం ఏమిటా అనే చర్చ కూడా సాగింది. ఒకవేళ పెద్దల ఒత్తిడి ఉన్నా కోర్టుకు ఏం చెబుతారని, అధికారులకు కోర్టు ఆదేశాలు పట్టవా అనేది అందరినీ తొలిచేస్తున్న ప్రశ్న. దీనికితోడు ఒక ప్రాంతంలో ఒక సమస్యపై కోర్టు స్టే కొందరికి ఇస్తే, అక్కడ అదే సమస్యపై అందరికీ స్టే వర్తిస్తుందనేది సహజ న్యాయ స్వభావ సూత్రంగా పెద్దలు చెబుతుంటారు. అయితే సంబంధిత అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా దుందుడుకుగా వ్యవహరించి ఇళ్లను తొలగించడం, పైగా ఇదేమిటని ప్రశ్నించిన మహిళలపై మగ పోలీసులు జులుం ప్రదర్శించి మానవ హక్కులను ఉల్లంఘించడం ఎవరి ప్రాపకం కోసమో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కోర్టు స్టే ఉన్నా అధికారులు ఇళ్లు తొలగించిన బాధిత కుటుంబాలను ప్రజాశక్తి పలుకరించింది. వారి ఆవేదన వారి మాటల్లోనే..



నా చిన్నప్పటి నుంచి ఎఎస్ఆర్ నగర్‌లోనే నివాసం ఉంటున్నాను. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాం. రూ.5 లక్షలు వెచ్చించి రేకుల షెడ్డు వేసుకున్నాం. ఈ ఇంట్లోనే మా నాన్న, అమ్మ, మా తమ్ముడు, మరదలు, నేను, నా భార్య మొత్తం మూడు కుటుంబాలు ఉండేవారం. మూడు నెలల క్రితం అధికారులు వచ్చి ఇంటిని తొలగిస్తున్నట్లు నోటీసు ఇచ్చారు. ఇదేమని అడిగితే కాలువ కాలుష్యం అవుతుందని, ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించుకున్నారని, అందుకే తొలగిస్తున్నామని చెప్పారు. ఏం చేయాలో తెలీక కోర్టును ఆశ్రయిస్తే కొన్ని రోజులపాటు గడువు ఇచ్చింది. మరోసారి అధికారులు ఇళ్లు తొలగిస్తున్నట్టు నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేస్తే తీసుకోలేదు. అధికారులు ఇంటి తలుపునకు నోటీసు అంటించి వెళ్లిపోయారు. మళ్లీ కోర్టును ఆశ్రయిస్తే స్టే విధించింది. అయితే అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోలేదు. తమ ఇంటికి స్టే ఉందని చెప్పినా వినకుండా పది మంది పోలీసులు జెసిబితో వచ్చి కళ్ల ముందే కూల్చేశారు. కనీసం ఒక పోర్షన్ అయినా ఉంచమని వేడుకున్నా నిర్ధాక్షిణ్యంగా కూల్చేశారు. మూడేళ్ల కుమార్తె జయశ్రీ, ఏడాదిన్నర కుమారుడు లక్కీ బాలాజీతో ఎక్కడికి వెళ్లాలో తెలీక ఇక్కడే కాలువ గట్టున బరకం కట్టుకుని సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజనం శిబిరంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేసి ఇక్కడే నివాసం ఉంటున్నాం' అని కన్నీటి పర్యంతమయ్యాడు.

- జుత్తిగ నాగమల్లేశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతులు



మా ఇంటిని ఎంతో చక్కగా నిర్మించుకున్నాం. ఎఎస్ఆర్ నగర్‌కు వచ్చిన ప్రతిఒక్కరూ ఇల్లు చాలా బాగుంది అనేవారు. రోజువారీగా ఆటో నడుపుకుంటూ రూపాయి రూపాయి కూడబెట్టి కొంత మొత్తంలో అప్పు చేసి ఉన్నదంతా ఇంటి నిర్మాణానికే ఖర్చు చేశాం. నాకు ఇద్దరు కుమార్తెలు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రూ.25 లక్షలు ఖర్చు చేసి నిర్మించుకున్నాం. దీని నిమిత్తం రూ.15 లక్షలు అప్పు ఉంది. దీనిని ప్రతినెలా వాయిదాల రూపంలో చెల్లిస్తున్నాం. 40 ఏళ్ల నుంచి ఎవరికీ అడ్డు లేకుండా ఇక్కడే బతుకుతున్నాం. అప్పటి నుంచి లేని కాలువ కాలుష్యం ఇప్పుడు వచ్చిందని, ఇల్లు తొలగిస్తామని అధికారులు చెబితే కోర్టును మూడుసార్లు ఆశ్రయించాం. కోర్టు స్టే విధించి ఇంటిని యథావిధిగా ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. అధికారులు ఇదేమి పట్టించుకోకుండా 15 మంది పోలీసులను పంపించి భయభ్రాంతులకు గురిచేసి కూల్చేశారు. కనీసం ఇంటిలో ఉన్న సామాన్లు కూడా తెచ్చుకునే సమయాన్ని కూడా ఇవ్వలేదు. కనీస కనికరం లేకుండా కళ్ల ముందే నిర్ధాక్షిణ్యంగా ఇంటిని తొలగించారు. ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వలేదు. ఉన్న ఇంటిని కూల్చేసింది. దిక్కుతోచని పరిస్థితుల్లో పాలకోడేరులో రూ.5 వేలు చెల్లించి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం', అని వాపోయారు.

- మల్లుల వెంకటేశ్వరరావు, పెద్దింట్లు దంపతులు

నాణ్యతా లోపాలుంటే ఉపేక్షించేది లేదు

పునరావాస కాలనీలపై ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - పోలవరం



పనులను పరిశీలిస్తూ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ, ఎంఎల్‌ఎ

పునరావాస కాలనీల నిర్మాణంలో నాణ్యతా లోపాలుంటే ఉపేక్షించేది లేదని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ అధికారులను హెచ్చరించారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు పర్యటనకు వచ్చిన ఎంపీ మార్గమధ్యంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద ఇటీవల వర్షాలకు తడిచిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి కలెక్టర్‌తో మాట్లాడి రైతుల సమస్యలను వివరించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకుని జలవనరుల శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బట్రస్ డ్యామ్ నిర్మాణం, డయాఫ్రంవాల్ నిర్మాణం పనుల పురోగతి గురించి సంబంధిత ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఆర్అండ్ఆర్ సమస్యల పరిష్కారం పూర్తిస్థాయిలో చేసేందుకు ఏమేర నిధులు అవసరమవుతాయనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కాలనీల నిర్మాణం ఎంత వరకూ వచ్చింది, ఇంకా ఎన్ని కాలనీల నిర్మాణం జరగాల్సి ఉందనే విషయాలపై హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. 2027 నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందన్నారు. టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పునరావాస కాలనీల నిర్మాణం విషయంలో నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించాలని, గతంలో నిర్మించిన కాలనీల్లో వర్షపు నీటి లీకేజీలకు మరమ్మతులు పటిష్టంగా చేపట్టాలన్నారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ ప్రతినెలా ఒక రోజు ఎంపీ పోలవరం పర్యటన చేసి సిఎంకు పనుల ప్రగతి వివరిస్తారన్నారు. సమావేశంలో ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, కూటమి నేతలు బొడ్డు కృష్ణ, గునపర్తి చిన్ని, కొణతాల ప్రసాద్, పరిమి రాంబాబు, నునకాని రాంబాబు, పెద్దేపు వీరవెంకట సత్యనారాయణ, ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాస్, తహశీల్దారు సాయిరాజు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

మెరుగైన వైద్యం అందించాలి : వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్రరావు

ప్రజాశక్తి - కుక్కునూరు



బాధితులను పరామర్శిస్తున్న నాగేంద్రరావు

తేనెటీగల దాడికి గురైన ఉపాధి కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఉచిత వైద్యం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం దాచారం పంచాయతీ నెమలిపేట గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశంలో 10 కుటుంబాలపై తేనెటీగలు దాడి చేయడం జరిగిందన్నారు. తేనెటీగల దాడిలో క్షతగాత్రులైన ఉపాధి కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం బృందం పరామర్శించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని ఉపాధి కూలీలకు మరో కష్టం ఎదురైందన్నారు. కూలీలు ఉపాధి పని చేస్తుండగా తేనెటీగలు దాడి చేశాయని, సుమారు 10 కుటుంబాలకుపైగా క్షతగాత్రులు అయ్యారని తెలిపారు. అత్యవసర వైద్య నిమిత్తం కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నా.. ఇది సరిపోదని అన్నారు. తీవ్ర గాయాలపాలైన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి ఉచితంగా వైద్యం ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. గాయాలపాలైన కుటుంబాలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గాయాలైన వారిలో కంటిపల్లి శిరీష, కుమారి, పట్ల దుర్గమ్మ, కారం రామారావు, కారం భద్రమ్మ, సీత, కౌలూరి శిరీష ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వంలో రైతులు దివాళా

మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కూటమి ప్రభుత్వంలో రైతులు దివాళా తీసే పరిస్థితికి చేరుకున్నారని, రైతు వ్యతిరేకి చంద్రబాబు పాలనా తీరు ఈవిధంగా ఉంటుందన్న నిర్ణయానికి రైతులు వచ్చారని పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పేర్కొన్నారు. సోమవారం కొయ్యలగూడెం లోని వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు గిట్టుబాటు ధరలు లేవంటూ బాలరాజు వద్ద ఏకరువు పెట్టారు. మిడిల్ గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయడం లేదని, అదేంటని బయ్యర్లను అడిగితే ఆర్డర్స్ రాలేదంటున్నారన్నారు. విదేశీ ఆర్డర్లను సాధించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని బాలరాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేజీ పొగాకు సరాసరి ధర రూ.340కు పైగా ఉంటేనే తాము పండించిన పంటకు మద్దతు ధర లభిస్తుందని రైతులు పేర్కొన్నారు. సన్న చిన్నకారు రైతులకు బోర్డు ద్వారా బేరన్ లైసెన్సులు మంజూరు చేయించాలన్నారు. వైసిపి పాలనలో మార్క్ఫెడ్ సంస్థను కొనుగోళ్లలో ప్రవేశపెట్టి రైతుకు గిట్టుబాటు ధర కల్పించగలిగామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం రైతుల కష్టాలను గాలికి వదిలేసిందన్నారు. వర్జీనియా పొగాకే కాకుండా మిర్చి, పామాయిల్, మొక్కజొన్న ధరలు పతనం అయ్యాయని, రబి సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల ధాన్యం రైతుల వద్ద నిల్వ ఉండిపోయిందన్నారు. ఓవైపు వరస తుఫానులతో పంటను రక్షించుకోలేకుండా రైతులు ప్రయాస పడుతున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించని పక్షంలో వైసిపి రైతుల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని కూటమి ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, ఎంపిపి గంజిమాల రామారావు, రైతు ప్రతినిధులు కాకర్ల నంది, గంటా రమేష్, గొడ్డటి నాగేశ్వరరావు, డి.బాబురావు పాల్గొన్నారు.

సకాలంలో సమస్యల పరిష్కారం

నూజివీడు టౌన్ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలలోని సమస్యలను సకాలంలో పరిష్కరించటం జరుగుతుందని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ తెలిపారు. నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా కొనసాగుతున్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు 15 మంది సమస్యలను అర్జీల రూపంలో అందించగా, సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్య పరిష్కారానికి నిర్ణీత వ్యవధి ఉందన్నారు. జటిలమైన సమస్యలు పరిష్కారం కాకుంటే వాటి వివరాలను అర్జీదారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాలు, పట్టణాలు, మండల స్థాయిల్లో సమస్యలు పరిష్కారం కాకుంటే ఆ సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చు అన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి, నాయకులు

ఫ్రాన్సిస్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ఫ్రాన్సిస్ తల్లి అందుగుల ముక్కమ్మ ఆదివారం రాత్రి అంబేద్కర్ కాలనీలోని తమ ఇంటి వద్ద కీర్తిశేషులైయ్యారు. సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఫ్రాన్సిస్ తల్లి అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మొడియం నాగమణి, తెల్లం రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు తామా ముత్యాలమ్మ, బద్ధా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి హాజరై సంతాపాన్ని ప్రకటించారు.

150 మందికి కంటి పరీక్షలు

కొయ్యలగూడెం : మండలంలోని పొంగుటూరులో ఎమెస్ ట్రస్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు శంకర నేత్రాలయం సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు కంటి సమస్యలు, జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. ఎమెస్ ట్రస్ట్ ఛైర్మన్ ఇవాంజెలిన్ మాట్లాడుతూ 45 ఏళ్ల పైబడిన వారు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శంకర నేత్రాలయం వైద్యులు డాక్టర్ రుతుజా, గుర్తించబడిన రోగులకు ఏలూరులో ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి గంగారం ఎఎలెస్ చర్చి పాస్టర్, చక్రవర్తి టి.రమేష్, పిఎస్.జెరియాపాల్, కెఎస్.అశోక్, డివి.వాదర, తారా, దివ్యజ్యోతి సహకరించారు. వారి సహాయంతో ఈ శిబిరం విజయవంతమైంది.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ముసునూరు : మండలకేంద్రమైన ముసునూరు గ్రామానికి చెందిన మానికల శ్రీనివాసరావు మాజీ సొసైటీ అధ్యక్షులు గత మాసం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా, ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం ముసునూరు గ్రామానికి చెందిన మానికల గంగాధరరావు(సాఫ్ట్‌వేర్ ఇంజనీర్) తన స్నేహితులతో కలిసి రూ.70 వేల నగదును శ్రీనివాసరావు(మాజీ సొసైటీ అధ్యక్షులు) కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం కింద అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు వారిని అభినందించారు.

అగ్రిగోల్డ్ ఆస్తుల వేలానికి జిల్లాస్థాయి కమిటీ

ఉత్తర్వులు జారీచేసిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు : స్పెషల్ కోర్టు ఏలూరు వారి ఉత్తర్వులు, ప్రభుత్వ జిఒ నెం.519, 9.4.2025 మేరకు అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేయడానికి జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారులు, జిల్లా రిజిస్ట్రార్, డిఐజిఆర్., జిల్లా ఐటి అధికారి(డిఇఒ. ఎన్ఐసి), సిఐడి అదనపు ఎస్‌పి, నగరపాలక సంస్థ ఎఇ, ఏలూరు స్పెషల్ కోర్ట్ అగ్రిగోల్డ్ సంస్థ సూచించిన పేర్ల సీతారామస్వామిని ఆథరైజ్డ్ మెంబరుగా జిల్లాస్థాయి కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సిఐడి అదనపు ఎస్‌పి కమిటీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఏలూరు అర్బన్, ద్వారకాతిరుమల మండల తహశీల్దార్లు, జిల్లాస్థాయి కమిటీకి, పోలీస్, సిఐడి దర్యాప్తు ఏజెన్సీల విచారణ సమయంలో వారికి సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు ఎక్కడ ఉన్నాయో పరిశీలించడం, సంబంధిత సబ్ రిజిస్ట్రార్ నుంచి భూముల విలువ సేకరించడం, అధీకృత సంస్థల నుండి సరసమైన మార్కెట్ ధర సేకరించడం, అగ్రిగోల్డ్ భూముల రెవెన్యూ రికార్డుల్లో మ్యూటేషన్ చేయడం, జిల్లాస్థాయి కమిటీ బాధ్యతగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలీసులు, ప్రజల మధ్య సంబంధాల మెరుగుకు 'పల్లెనిద్ర'

నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ

ముసునూరు : పల్లె నిద్ర కార్యక్రమం ద్వారా పోలీస్ శాఖ అధికారులకు, ప్రజలకు మధ్య మానవీయ విలువలు మెరుగుపడుతాయని, పోలీసులంటే అంతర్గత భయం పోవడానికి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ అన్నారు. మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, నూజివీడు డిఎస్‌పి కెవివిఎస్ఎన్.ప్రసాద్ ఆదేశాల మేరకు నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ, ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి, ఇతర శాఖల అధికారులతో కలిసి పల్లెటూరు గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్తులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, వారి భద్రత, సమస్యలు, నేర నివారణ విషయాలపై చర్చించారు. ముఖ్యంగా సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, బ్యాంకు పేరుతో వస్తున్న ఫేక్ మెసేజ్, ఆధార్ అప్డేట్ మోసాలు, ఫేక్ లింకులు క్లిక్ చేయడం వల్ల డేటా చోరీలు జరుగుతాయని, లాటరీ గెలిచినట్లు మెసేజ్‌ల ద్వారా ఒటిపి అడిగి అకౌంట్లో డబ్బు మాయం చేసే మోసాల గురించి వివరించడంతో పాటు, ఇలాంటి సందర్భాల్లో సైబర్ హెల్ప్‌లైన్ 1930 లేదా టోల్ ఫ్రీ నెంబర్‌కు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలు ఆపద సమయంలో డయల్ 112కు ఫోన్ చేస్తే 15-20 నిమిషాల్లో సహాయం అందించబడుతుందని, గ్రామాలలో చిన్న చిన్న సమస్యలు తలెత్తిన సమయాలలో పోలీసు వారికి తెలియజేస్తే సదరు సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. అది శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పరిష్కార మార్గాలను పోలీసు వారు తీసుకుంటారని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సీసీ టివిలను ఏర్పాటు చేసుకోవడం వల్ల నేర దర్యాప్తు సమయాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, ఇసుక అక్రమ రవాణా వంటి అంశాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గద్దల సుజాతని మోహనరావు, ఎన్ఎస్‌పి ఏసి ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ, మాజీ సర్పంచి బొమ్మకంటి శ్యామలరావు, మాజీ సర్పంచి ఉడిపాటి సాంబయ్య, టిడిపి నాయకులు పిన్నిబోయిన మంగయ్య, గూడపాటి అజయ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో ఎన్‌పిఇఎల్ పరీక్ష

నూజివీడు టౌన్ : నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో సోమవారం నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్హాన్స్‌డ్ లెర్నింగ్(ఎన్‌పిటిఇఎల్) పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ 10,300 మందికి పైగా విద్యార్థులు 4 ట్రిపుల్ ఐటీల క్యాంపస్లలో పాల్గొన్నట్లు చెప్పారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతుందని వివరించారు. ఈ పరీక్షలు విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటాయన్నారు. ఐఐటిలు, ఐఐఎస్‌సి వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల భాగస్వామ్యంతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రపంచస్థాయి సాంకేతిక విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. నాలుగు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లలో ఎన్‌పిటిఇఎల్ కోఆర్డినేటర్లు, ఫ్యాకల్టీ, సాంకేతిక బృందాలు, పరిపాలన సిబ్బంది సమిష్టిగా కృషిచేసినట్లు చెప్పారు. విద్యార్థుల అత్యుత్తమ సమన్వయంతో పరీక్షలు పారదర్శకతను నిరూపించినట్లు తెలిపారు. ఆర్‌జియుకెటి విద్యా ప్రమాణాల పెంపు దిశగా, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని సోదాహరణంగా వివరించారు.

విద్యుత్ ఉద్యోగులకు పెన్షన్, జిపిఎఫ్ వర్తింపచేయాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్, జిపిఎఫ్ వర్తింపచేయాలని విద్యుత్ ఉద్యోగులు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు విద్యుత్ ఉద్యోగుల జిపిఎఫ్ సాధన సమితి సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో వారు ఎంపీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ విరమణ అనంతరం తమకు పెన్షన్‌తో సహా ఇతర సౌకర్యాలు వర్తింపచేయకపోవడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. తమ సమస్యను చట్టసభల్లో ప్రస్తావించి పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపీ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత వరకు పరిష్కారానికి కృషిచేస్తానని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు మామిడి ఇక కనుమరుగేనా..?

వాతావరణ అనుకూలత లాభాలు లేక నరికేస్తున్న మామిడి తోటలు
రక్షించాలని మామిడి ప్రియులు, రైతన్నల వేడుకోలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మామిడి అనగానే ముందుగా గుర్తుకొచ్చేది నూజివీడు మాత్రమే. ఈ విషయం ఎవరో భుజం తట్టి చెప్పాల్సిన అవసరం లేదు. మామిడి ప్రియులందరూ ప్రతి సీజన్‌లో పలికే పదమే నూజివీడు. అలాంటి నూజివీడు మామిడి నేడు రాను రాను అంతరించిపోతోందని అందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన నూజివీడు నియోజకవర్గంలో మామిడి 34 వేల పైచిలుకు ఎకరాల్లో సాగవుతోంది. నూజివీడు ప్రాంతంలోని మామిడిలో చిన్న రసాలు, పెద్ద రసాలు, బంగినపల్లి, పోతాపురి, యనమదల తీయమామిడి, హిమాయసంత్, చెరకు రసం, కొబ్బరి మామిడి, నూజివీడు మామిడి వంటి అనేక రకాలను రైతన్నలు పండిస్తున్నారు. వాతావరణ అనుకూలత, ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందించకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడి నేడు నూజివీడు మామిడి పూర్తిగా అంతర్థానమయ్యే ప్రమాదం వాటిల్లుతోంది. నూజివీడు పట్టణంలో మామిడి పరిశోధన కేంద్రం, పండ్ల శుద్ధి కేంద్రం కేవలం అలంకారప్రాయంగానే మిగిలి ఉన్నాయని చెప్పక తప్పటం లేదు. ప్రతి సీజన్‌లో అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. మామిడి పరిశోధన కేంద్రం నుంచి ఓ బ్యానర్ పెట్టి కార్యక్రమాలను నిర్వహించి మమ అనిపించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు లేకపోలేదు. మామిడి పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలు నేటి వాతావరణానికి అనుకూలమైన సలహాలు, సూచనలు ఇవ్వడంలో ఏ మాత్రం ముందడుగు వేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అదే జరిగితే పరిశోధన కేంద్రం ఉన్న ప్రాంతంలోనే సాగు చేస్తున్న మామిడి చెట్లు, ఇతర ఫలాల వృక్షాలకు తగిన సమయంలో యాజమాన్య పద్ధతులు అవలంభించి, మోడల్ ట్రీ ప్లాంటేషన్‌గా తమలాంటి రైతులకు చూపిస్తారని మామిడి రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మామిడి పండ్ల తోటల సాగును పరిశీలించి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించడంలో ఉద్యాన శాఖాధికారులు ఏమాత్రం ముందుకు రావడంలేదని రైతులలో విమర్శలు లేకపోలేదు. ఇక ప్రజాప్రతినిధులు తమ పబ్బం గడుపుకునేందుకు ఓటు బ్యాంకుగా మారిన రైతులకు మాయమాటలు చెప్పి, వారి నుంచి ఓట్లు దండుకుని కంటికి కనిపించడం లేదన్నారు. సరదాగా సమావేశాలు పెట్టి హామీలు మాత్రం గుప్పిస్తున్నారు కాని, ఆచరణలో అంగుళమైన ముందుకు కదలకపోవడం దారుణమన్నారు. ఇలాంటి దుస్థితిలో నూజివీడు మామిడి తోటలను, రైతులను ఆదుకునే నాధుడు లేడంటూ ఈ ప్రాంత రైతాంగం బోరున విలపిస్తున్నారు. కేవలం వేసవి సీజన్ వస్తేనే మామిడి పంట, రైతులు జ్ఞప్తికి వస్తారని, మిగిలిన సమయాల్లో ఎందుకు గుర్తుకురారని ప్రశ్నిస్తున్నారు. నూజివీడు బ్రాండ్‌గా అంతర్జాతీయ స్థాయిలో నిలిచిన మామిడిని కాపాడుకోలేని పాలకులు ప్రజలను ఎలా పరిపాలిస్తారని సన్న కారు రైతు సూటిగా ప్రశ్నిస్తున్నారు. నిర్లక్ష్యం నీడ ఇలాగే కొనసాగితే మామిడి కేవలం పాఠ్యాంశంగానే మిగిలిపోతుందని, నూజివీడు మామిడి కనుమరుగవుతుందని రైతన్నలు వివరిస్తున్నారు. ఇప్పటికే నష్టాల బారిన పడటంతో చాలావరకు మామిడి తోటలను నరికి తొలగిస్తూ స్వల్పకాలిక పంటల వైపు వెళ్లిపోతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి ప్రపంచ దేశాల్లో నూజివీడు మామిడి ఖ్యాతిని నిలబెట్టాలని ముక్తకంఠంతో రైతన్నలు వేడుకుంటున్నారు.



కొన్నంగుంట గ్రామంలో నరికేస్తున్న మామిడి చెట్లు

కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా గురుకుల విద్యార్థులు

గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ దాసరి మేరి ఝాన్సీ రాణి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు పోటీగా గురుకుల పాఠశాల విద్యార్థులు నిలుస్తారని వట్లూరు అంబేద్కర్ గురుకులం పాఠశాల ప్రిన్సిపల్ దాసరి మేరి ఝాన్సీ రాణి తెలిపారు. కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ముంబై వారి ఆధ్వర్యంలో జిల్లాలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంను ఏలూరులోని అతిథి హోటల్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి మాట్లాడుతూ ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌ను సోమవారం, మంగళవారం, బుధవారం నిర్వహించనునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లా గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు. రానున్న రోజుల్లో తమ విద్యార్థులు కార్పొరేట్ స్కూల్స్ విద్యార్థులకు పోటీగా ఇంగ్లీష్ మాట్లాడగలుగుతారని దీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

బంజారా భజరంగీ భేరి సంఘ ఆధ్వర్యాన ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సమస్యలు పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బంజారా భజరంగీ భేరి సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ నాయక్ ఎంపిడిఒ మణికుమారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామంలో చెత్త పోగులు, లీక్ అవుతున్న వాటర్ పైప్‌లైన్లు, మురికి కాలువల సమస్యలతో గ్రామం అస్తవ్యస్థంగా ఉందన్నారు. గత సంవత్సర కాలం నుంచి గ్రామంలోకి చెత్తను సేకరించే ఆటో రావడంలేదని, దానివల్ల ఎక్కడపడితే అక్కడ చెత్త పోగులు ఏర్పడి గ్రామమంతా దుర్వాసన వస్తుందని, రాబోయే వర్షాకాలంలో అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, చెత్త సేకరించే ఆటోను గ్రామానికి పంపించి సమస్యను పరిష్కరించాలని కోరారు. మంచినీటి పైపులు లీకేజ్ అవ్వడం వల్ల నీటి కొరత సమస్య ఏర్పడుతుందని తెలిపారు. పైపులైన్లు మరమ్మత్తులు చేయాలని, కొన్ని వీధుల్లో నూతన పైప్ లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. మురుగు నీటి సమస్యను పరిష్కరించడం కోసం డ్రైయినేజీలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమస్యలపై ఎంపిడిఒ మణికుమారి సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో బంజారా భజరంగి కమిటీ సభ్యుడు ధరావత్ శంకర్ నాయక్ ఉన్నారు.

హేలాపురి సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలి

ఏలూరు : పిల్లల్లో సృజనాత్మకతను పెంచడానికి రకరకాల అంశాలతో కూడిన హేలాపురి సమ్మర్ క్యాంపును అందరూ వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆదివారపు పేటలో ఉన్న ఎఆర్‌డిజికె మున్సిపల్ హై స్కూల్‌లో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న పది రోజుల సమ్మర్ క్యాంపులో పేపర్లతో బొమ్మలు చేయడం, బియ్యం గింజలపై అక్షరాలు రాయడం, కరాటే శిక్షణ, ఆహార నియమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పేపర్ క్రాఫ్ట్ గురించి డ్రాయింగ్ టీచర్ పిఎల్.నాగేశ్వరరావు నేర్పారు. సరదా సరదా గణితం తేలిగ్గా తెలుగు గురించిన కొన్ని మెలకువలు తెలుగు గణిత నిపుణులు వై.ఆనంద నాయుడు పరిచయం చేశారు. మైక్రో ఆర్ట్స్ ఆసక్తి కలిగించు విషయాలు బియ్యం గింజపై 108 అక్షరాలు రాసిన ఐఎంజి అవార్డు గ్రహీత దొర శివప్రసాద్ చెప్పారు. ఆత్మ రక్షణ, శరీర ధృఢత్వం కోసం నేర్చే కరాటే గురించి కరాటే మాస్టర్ జి.ప్రసాద్ వివరించారు. వేసవిలో పిల్లలు, పెద్దలు అందరూ రైతులు పండించే పళ్ల రసాలు, సహజ పానీయాలు తాగాలని కూల్ డ్రింకుల ద్వారా వచ్చే నష్టాలు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు వివరించారు. సమ్మర్ క్యాంపుకు 50 మంది పిల్లలు, పదిమంది వరకు తల్లిదండ్రులు హాజరయ్యారు.

ఫిర్యాదుదారుల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో పోలీసు శాఖ కృషి చేస్తుందని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ప్రతి సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఈ సోమవారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌పి, జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావులు స్వయంగా పాల్గొని ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఎస్‌పి వెంటనే సంబంధిత అధికారులతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమానికి వచ్చే వినతులను వెంటనే పరిష్కరిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. సివిల్ సంబంధిత ఫిర్యాదులను పోలీస్ స్టేషన్లో పరిష్కరించమని, ఆయా న్యాయస్థానాల్లో వాటిని పరిష్కరించుకోవాలని ఆయన వారికి సూచించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 36 ఫిర్యాదులను స్వీకరించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

20న ఉపాధి పనులు నిలిపివేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కుక్కునూరు : ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని, పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చీరవెల్లి, దామరచర్ల గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ మనకు పిడికెడు మెతుకులు పెడ్తోన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉ పాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని పాలకవర్గాలు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని తిరిగి పోరాడి రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకు ఈనెల 20న ఒక రోజు దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పనులు బంద్ చేయాలని, మండల కేంద్రాలు, గ్రామ సచివాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయాలన్నారు. ఒక పక్క వ్యవసాయపు పనులు క్రమేపి తగ్గిపోతున్నాయని, రెక్కల కష్టమే ఆధారంగా జీవిస్తున్న పేదలకు వంద రోజుల ఉపాధి పనులే దిక్కొతున్నాయన్నారు. పొమ్మన లేక పొగబట్టేతీరుగా ప్రభుత్వాలు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ఈనెల 20న బందులో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. **జీలుగుమిల్లి :** ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయకార్మిక సంఘం మండల కార్యదర్శి కారం నాగదుర్గ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం మండలంలోని దాట్లవారి గూడెం గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం, ఉపాధి హామీ చట్టానికి కేంద్రంలో నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న దేశవ్యాప్తంగా ఉపాధి పనులు బంద్ చేయనున్నట్లు తెలిపారు. బంద్‌కు ఉపాధి కూలీలు, మేట్లు, అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.



జీలుగుమిల్లి : కూలీలతో మాట్లాడుతున్న నాగదుర్గ

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు

ఏలూరు అర్బన్ : అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం ఏలూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల వివిధ పంటలు దెబ్బతిని రైతాంగం నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం తడిచిపోయిందని చెప్పారు. మామిడి, జీడి మామిడి, అరటి, మొక్కజొన్న, కూరగాయలు, పొగాకు తదితర పంటలకు నష్టం జరిగిందన్నారు. పంటలకు జరిగిన నష్టాలను వెంటనే నమోదు చేయాలని కోరారు. పంటలకు ఏమేరకు నష్టం జరిగితే ఆ మేరకు నష్టాలు నమోదు చేసి నష్టపరిహారం చెల్లించి, రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించి కోకో రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కోకో రైతులు చేస్తున్న పోరాటానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశం సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు గుండపనేని సురేష్, గుర్రం రాంబాబు, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు సమ్మర్‌క్యాంప్ 7వ రోజు సోమవారం ఎంతో వినోదాత్మకంగా నిర్వహించారు. శిక్షణ తరగతులను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు పర్యవేక్షించారు. అనంతరం గ్రంథాలయ సిబ్బంది బివిఎస్.లక్ష్మి విద్యార్థులకు ఓంకారం నినాదంతో యోగా క్లాసులు నిర్వహించారు. తొలుత రిసోర్స్‌పర్సన్ పి.సంతోషకుమారి విద్యార్థులకు నేటి సమాజంలో 'చెడ్డస్నేహం - చెడ్డ ఫలితాలు' బారినపడకుండా జాగ్రత్త వహించాలని, అవి దుష్ఫలితాలకు దారితీస్తాయంటూ విలువైన సూచనలు ఇచ్చారు. రెండు నీతి కథలను తోడేలు - కోతి, చిన్నపిట్ట - చిన్నప్రయత్నం - పెద్దఫలితం భోదించారు. అనంతరం డి.శ్రీవల్లి రిసోర్స్ పర్సన్ విద్యార్థులకు స్వాతంత్ర సమరయోధులు, దేశనాయకుల జీవితచరిత్రల గురించి వివరించారు. యోగాలో ఒక భాగం బ్రెయిన్ జిమ్ చేయించారు. రిసోర్స్‌పర్సన్ పి.శంకర్ డ్రాయింగ్ టీచర్, విద్యార్థులకు రకరకాల చిత్రలేఖనంపై శిక్షణ అందిస్తున్నారు. అనంతరం విద్యార్థులకు విరామంలో స్నాక్స్ పంచి పెట్టడం జరిగింది. అనంతరం ప్రముఖనృత్య కళాకారులు వై.ఫణికాంత్, విద్యార్థులకు నృత్యాలపై శిక్షణలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వివి సందీప్ కుమార్, ఎండి.అస్లాం పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండి : వేసవి విజ్ఞాన శిబిరంలో బాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష చేసినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు తెలిపారు. భాషల గొప్పతనం గురించి విద్యార్థులకు కళా నాగేశ్వరం వివరించారు. పలు పాఠశాలల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి, గురజ శాఖ గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారంతో ఏడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పసుమర్తి సూర్య నారాయణ మూర్తి అనే ఉపాధ్యాయుడు మొట్టమొదటి మన దేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ బాల్యం నుండి పిల్లలకు వివరించారు. తదుపరి విద్యార్థులకు నీతి పద్యాలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా భూమి.. మాకు ఇప్పించండి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్న బాధిత కుటుంబం

ప్రజాశక్తి - బుట్టాయిగూడెం

మా భూములు మాకు దక్కకుండా దాడి చేస్తున్నారని, రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని బుట్టాయగూడెంకు చెందిన భాషా రంపల రాజు కుటుంబం తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. వివరాల్లోకెళితే బుట్టాయగూడెంకు చెందిన భాషా కుటుంబానికి మర్రిగూడెం గ్రామంలో సర్వే నెంబరు 415లో య.10-58 సెంట్లు, సర్వే నెంబరు 416లో య. 4-28 సెంట్లు, సర్వే నెంబరు 417/1లో య 8-50 సెంట్లు, మొత్తం విరిసి య 23-36 సెంట్లు భూమి ఉంది. 2002, 2026 సంవత్సరంలో బుట్టాయిగూడెం రెవెన్యూ అధికారులు భూమి పంచనామా చేసి తమ కుటుంబానికి అప్పచెప్పారని, అప్పటినుంచి ఇప్పటివరకు ఆ భూములో సాగులో మా కుటుంబమే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఈ భూములకు సంబంధించిన పూర్తి ఆధారాలు మా దగ్గర ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఈ భూముల్లోకి మర్రిగూడెం గ్రామస్తులు అక్రమంగా కత్తులతో, కర్రలతో ప్రవేశించి మా కుటుంబంపైకి అక్రమంగా దాడి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భూమిలో జీడి మామిడి తోట, మామిడి తోట ఉన్నాయని, సీజన్ వచ్చేసరికి మర్రిగూడెం గ్రామస్తులైన పూనెం పార్వతి, పాయం గంగాజలం, పాయం పెంటయ్య, గోరం చెల్లయ్య, మడకం అన్నపూర్ణ, మడకం మంగమ్మ, పట్టబల్లి వెంకమ్మ, పాయం బేబీ, గాలి కమల, కుంజా భూదేవి, బుద్దుల గంగాదేవి, గోరం మారయ్య, మడకం భీమమ్మ, కొమరం వెంకటప్ప, గుర్రం నాగరాజు, సముద్రాల సుందరం, పాయం దుర్గారావు వీరంతా కలిసి కత్తులతో, కర్రలతో తోటలో పనిచేస్తూ ఉండగా వచ్చి దాడి చేశారని తెలిపారు. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని తోట వెనక వైపు నుంచి పారిపోయి వచ్చి బుట్టాయిగూడెం రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న ఫలితం లేదని, ప్రొడక్షన్ ఆర్డర్ ఉన్న పోలీస్ సిబ్బంది పట్టించుకోవడం లేదని, మాకు న్యాయం చేయాలని ఈ ఆమరణ నిరాహార దీక్షను చేపట్టినట్లు వారు వివరించారు. రెవెన్యూ ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి తమ భూములు తమకు అప్పగించే వరకు ప్రాణాలు పోయినా పర్వాలేదని, న్యాయం చేయాలని బుట్టాయిగూడెం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ దీక్షలో భాషా శ్యాంబాబు, భాషా రాజేష్, భాషా వెంకాయమ్మ, వేములూరి నాగేంద్ర, వేములూరి ముకుందా, వెంకటలక్ష్మి, భాషా, నాగేశ్వరరావు ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

రాగి వైరు మాయం..

జీలుగుమిల్లి: మండలంలోని టి.గంగన్నగూడెం గ్రామ సమీపంలోని వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును మాయం చేసిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. విద్యుత్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం టి.గంగన్నగూడెం గ్రామానికి చెందిన మోడియం లక్ష్మి, కోర్స వీరప్ప, దుపగుంట్ల లింగయ్యలకు చెందిన వ్యవసాయ భూములకు వ్యవసాయం నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయగా దాన్ని ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ ను కింద పడేసి అందులోని కాపర్ వైరును మాయం చేసినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు ఘటన స్థలానికి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించగా రాగి వైరు మాయమైనట్లు గుర్తించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో ట్రాన్స్‌ఫార్మర్‌లలో రాగి వైర్ల దొంగతనాలు వరుసగా జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం

చింతలపూడి : వేసవిలో దాహం తీర్చటానికి చలివేంద్రం ప్రారంభించినట్లు ఆయిల్ మిల్, రైస్ మిల్ యజమానులు మాడా సత్యనారాయణ, మాడా శ్రీనివాస రావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి శాఖ ఆధ్వర్యంలో చింతలపూడి కొత్త బస్ స్టాండ్‌లో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. డాక్టర్ ఎ.సత్యనారాయణ, జె.విశ్వేశ్వరరావు, ఎ.రాజారావు, కె.నాగ చిన్నారావు, ఎస్.కిరణ్, ఎం.సామ్యూల్, ఎన్.రాజా, బివిఎస్ఎన్.రాజు, పి.గాంధీ పాల్గొన్నారు.

భారీగా ట్రిపుల్ ఐటి దరఖాస్తులు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ఆర్‌జియుకెటి పరిధిలో గల ట్రిపుల్ ఐటీలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రక్రియకు భారీగా దరఖాస్తులు వస్తున్నట్లు అడ్మిషన్స్ కన్వీనర్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ వెల్లడించారు. గడచిన వారం రోజుల్లో 15,500 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. అధిక సంఖ్యలో వచ్చే దరఖాస్తుల నుంచి ప్రభుత్వ నియమనిబంధనలు, రిజర్వేషన్ రోస్టర్ విధానంలో ప్రగతి పథంలో ఉన్న విద్యార్థులకు అడ్మిషన్లు అందించటం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని తెలిపారు.

ఎంటర్ పెన్యూర్షిప్ ఎడ్యుకేషన్ ప్రారంభం

నూజివీడు టౌన్ : ఆర్‌జియుకెటి, వద్వానీ ఫౌండేషన్ సంయుక్తంగా ఎంటర్ పెన్యూర్షిప్ ఎడ్యుకేషన్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో సోమవారం ప్రారంభమైంది. ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ 49 మంది అధ్యాపకులు పరిశ్రమల అవసరాల కోసం అనేక కోర్సులను అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలకు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఆర్‌జియుకెటి డీన్ డాక్టర్ రియాజ్ హుస్సేన్, కేంద్ర ఆర్థిక అధికారి డాక్టర్ నాగార్జున దేవి, నూజివీడు ఆర్థిక అధికారి డాక్టర్ శ్రీనాథ్, డీన్ అకాడమిక్స్ డాక్టర్ చిరంజీవి, అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలుచేస్తాం : ఎంపీ

టి.నరసాపురం: పోలవరం నియోజకవర్గంలో ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తెలిపారు. మండలంలోని మల్లుకుంట గ్రామంలో నిర్వహిస్తున్న గంగానమ్మ జాతరలో సోమవారం పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు, మొక్క జొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కృషిచేస్తానన్నారు. జంగారెడ్డిగూడెం, ఏలూరు రహదారి నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, పేరుబోయిన శ్రీనివాసరావు, పరసా శ్రీనివాస రావు, చలవల అప్పలరాజు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

నూజివీడు టౌన్ : కార్మిక దినోత్సవం వారోత్సవాల సందర్భంగా సోమవారం నూజివీడు పట్టణంలోని ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో లీగల్ అవేర్నెస్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివ పార్వతి మాట్లాడుతూ కార్మికులు వాళ్లకు గల హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్మికులు పనిచేసే సమయంలో ఏదైనా ప్రమాదానికి గురైతే అలాంటి వారికి బీమా ఉంటుందని, అందరికీ సమాన వేతనం ఉంటుందని, పనిచేసే సమయం ఎనిమిది గంటలు అని తెలియజేశారు. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ హెచ్‌ఆర్ ఎం.వరప్రసాద్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ జి.అనిల్ కుమార్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ కార్మికులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి'

చింతలపూడి : పాత తాలూకా కేంద్రాలలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న నూతనమైన మార్పులు పున: పరిశీలన చేయాలని, ప్రభుత్వ పాఠశాలను పరిరక్షించాలని ఎపిటిఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. 12వ పిఆర్‌సి కమిషన్, మధ్యంతర భృతి, సిపిఎస్ విధానం రద్దు, 2003 డిఎస్‌సి వారికి పాత పెన్షన్ విధానం అమలు మొదలైన అంశాలపై చింతలపూడి తాలూకా కేంద్రంలో ఎపిటిఎఫ్ చింతలపూడి, టి.నర్సాపురం, లింగపాలెం మండల శాఖ సభ్యులు నిరసన చేపట్టి తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. సీనియర్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.